మురుగు.. రోడ్లపై పరుగు!

- గుత్తి మున్సిపాలిటీలో సమస్యల తిష్ట
- రోడ్లు, ఇళ్ల ముందు ప్రవహిస్తున్న మురుగునీరు
- పట్టించుకోని అధికారులు



బీసీ కాలనీలో ఇళ్ల ముందు నిల్వ ఉన్న మురుగు



కేపీఎస్ కాలనీలో అపరిశుభ్రత ఇలా..

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ కాస్త మురికిపాలిటీగా మారింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఓల్డ్ సీపీఐ కాలనీ, బీసీ కాలనీ, కేపీఎస్ కాలనీ, కుమ్మర వీధి, ఉప్పర వీధి, నేసే వీధి, బ్రాహ్మణ వీధి ఇలా ఏ వీధి చూసినా ఏముంది గర్వకారణం.. సమస్తం మురికి మయం అన్న చందంగా తయారైంది. మురుగు ఇళ్ల ముందు, రోడ్లపై నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. వాహనాదారులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట డ్రైనేజీ నీరు తాగునీటి పైపుల్లో చేరి నీరు కలుషితం అవుతోంది. పట్టణంలో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందడంతో చీకటి పడితే పట్టణవాసులపై దండయాత్ర చేస్తున్నాయి. దోమల కాటుతో తరచూ వ్యాధులకు గురి అవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛత కార్యక్రమాలు, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు చేపట్టినా అవి ప్రచార ఆర్భాటాలకే పరిమితం అయ్యాయని, ఎలాంటి ఉపయోగం లేదని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణం	గుత్తి
వార్డులు	25
కాలనీలు	40
జనాభా	90 వేల మంది

డ్రైనేజీ వ్యవస్థ దారుణం



మున్సిపాలిటీ పరిధిలో డ్రై నేజీ వ్యవస్థ, రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. మురుగు ఇళ్ల ముందు, రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–నిర్మల, గుత్తి

దుర్వాసన భరించలేకున్నాం



డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసన భరించలేకున్నాం. కనీసం నడవటానికి కూడా వీలు కానంత అధ్వానంగా మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దోమల బెడద ఎక్కువై రోగాల బారిన పడుతున్నాం.

–శ్యామల, గుత్తి

అధికారులు స్పందించాలి



డ్రైనేజీ కాలువలను 20 రోజులకు ఒకసారి కూడా శుభ్రం చేయడం లేదు. పైగా డ్రైనేజీ కాలువలే సరిగా లేవు. దీంతో మురుగంతా ఇళ్ల ముందు, జనావాసాల నడుమ నిల్వ ఉంటోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించాలి.

–మల్లిక, గుత్తి

చర్యలు తీసుకుంటున్నాం



డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే రోడ్లు, డ్రై నేజీ సమస్యలను పరిష్కరిస్తాం. ఇప్పటికే డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి కార్యాచరణ పూర్తి చేశాం. మున్సిపల్ ప్రజలు ఇంటిలోని చెత్తను డ్రైనేజీల్లో వేయకూడదు.

–జబ్బార్‌మియా, మున్సిపల్ కమిషనర్, గుత్తి

ఏఐపై అవగాహన పెంచుకోవాలి



గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్, అధ్యాపకులు

గుత్తి: ఇంజినీరింగ్ విద్యార్థులు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) పట్ల అవగాహన పెంచుకోవాలి. ఏఐ ద్వారా భారత్ 2047లో ప్రపంచంలోనే నంబర్ వన్ అయ్యే అవకాశ ముందని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. గుత్తిలోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం ఇంజనీరింగ్ విద్యార్థులతో ముఖాముఖి (ఇన్స్పిరేషనల్ టాక్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏఐ గురించి విద్యార్థులకు వివరించారు. భవిష్యత్ అంతా ఏఐ దేనన్నారు. ఏఐ పట్ల విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ ఏఐ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, డైరెక్టర్ వాణి, ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, గుత్తి, పెద్దవడుగూరు తహసీల్దార్లు ఓబులేసు, ఉషారాణి, గేట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెడ్‌వీరారెడ్డి కాలనీని సందర్శించిన కలెక్టర్

గుత్తి/గుత్తి రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జెడ్ వీరారెడ్డి కాలనీని గురువారం కలెక్టర్ వినోద్‌కుమార్ సందర్శించారు. కాలనీలో మౌలిక వసతులు లోపించాయని పలుమార్లు కాలనీవాసులు, సీపీఎం నాయకులు ఆందోళనలు చేపట్టారు. సాక్షి దిన పత్రికలో కూడా కాలనీలో మౌలిక వసతుల లేమి గురించి ఇటీవల కథనం వచ్చింది. దీంతో కలెక్టర్ జెడ్‌వీరారెడ్డి కాలనీని సందర్శించి కాలనీవాసులతో మాట్లాడారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటు చేయాలని వారు కోరారు. అనంతరం కలెక్టర్ గుత్తి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడే జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ బసినేపల్లి గ్రామంలో పర్యటించి తాగునీటి ట్యాంకులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



మట్టిలో కూరుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మట్టిలో కూరుకుపోయి ప్రమాదకరంగా మారింది. గ్రామ శివారులోని చెంద్రాయుని కుంట సమీపంలో ఇటీవల నూతన రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే రోడ్డు తగ్గ ఉండటంతో ఎత్తు పెంచేందుకు భారీ ఎత్తున ఎర్ర మట్టిని తోలారు. దీంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మట్టితో మూసుకుపోయింది. సమీపంలోనే చెన్నకేశవ స్వామి ఆలయానికి రోజూ భక్తులు వస్తుంటారు. పొరపాటున ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకితే ప్రాణాలు పోయే అవకాశాలు ఉన్నాయని భక్తులు వాపోయారు. చెంద్రాయుని కుంట కింద భాగంలో భారీ నీటి గుంత ఉండేది. అయితే గుంతను మట్టితో మూసి రోడ్డు వేశారు. ఈ క్రమంలో 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కూడా మట్టిలో కూరుకుపోయింది. స్థానిక రైతులు, రోడ్డు కాంట్రాక్టర్ విద్యుత్ అధికారులకు విషయం తెలపడంతో పది రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు కొద్ది దూరంలో దిమ్మె కట్టి వెళ్లిపోయారు. ట్రాన్స్‌ఫార్మర్ మట్టిలో కూరుకుని ప్రమాదకరంగా మారి తరచూ కరెంట్ సరఫరా నిలిచి పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మట్టితో మూసుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్ రాత్రి పూట కనిపించక ఆటోలు, ఇతర వాహనాలు వెళ్లి ఢీకొంటే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు. ప్రమాదం జరగక ముందే విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రదేశంలోకి మార్చాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

హెల్మెట్ లేకుంటే వాహనం సీజ్



వాహనదారులను హెచ్చరిస్తున్న ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్

పెద్దపప్పూరు: హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనదారులు వాహనం నడిపితే తొలిసారి జరిమానా విధిస్తామని, రెండోసారి పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. గురువారం ఆయన చాగల్లు ప్రాజెక్టు సమీపంలోని కూడళ్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు.

క్లోరిన్ శాతం పరిశీలన



నీటిలో క్లోరిన్ శాతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

తాడిపత్రి రూరల్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం మునిసిపల్ కమిషనర్ శివరామక్రిష్ణ పర్యటించారు. ఆయా వార్డుల్లో కొళాయిల్లో వస్తున్న తాగునీటి సరఫరా గురించి ఆరా తీశారు. నీటి ఎద్దడి సమస్యను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని 9వ వార్డులో కొళాయిల్లో వస్తున్న నీటిలో క్లోరిన్ శాతాన్ని సిబ్బంది వద్ద ఉన్న పరికరం సాయంతో పరిశీలించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



యాడికి మండలం పిన్నేపల్లికి ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దవడుగూరు: యాడికి మండలంలోని పిన్నేపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు కృషి చేస్తున్నారు. ఐదు రోజులుగా యాడికిలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. దీంతో మండలంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బంధువులు, మిత్రులను పిలుచుకుని ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని గుర్తించిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సొంత ఖర్చులతో ట్యాంకర్ ఏర్పాటు చేసి రెండు రోజులుగా నీరు సరఫరా చేస్తున్నారు. గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితం

పెద్దపప్పూరు: ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం సురక్షితమని డాక్టర్ ఉన్నతి గర్భిణులకు సూచించారు. గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. అత్యవసర సమయాల్లో ప్రతి ఒక్కరూ 104, 108 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్ వలి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

గుంతకల్లు రూరల్: కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను గురువారం గుంతకల్లు పట్టణంలోని అంజలినగర్‌లో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తహసీల్దార్ రమాదేవి, టీడీపీ నాయకుడు నారాయణస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

హుండీ కానుకల లెక్కింపు



శివపురం పెద్దమ్మ ఆలయంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న గ్రామస్తులు

శింగనమల: మండలంలోని పెద్దమ్మ ఆలయంలో గురువారం హుండీలోని కానుకలను లెక్కించినట్లు దేవదాయ శాఖ ఈఓ శోభ తెలిపారు. ఈ సందర్భంగా రూ.4,77,561 ఆదాయం సమకూరిందన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూర్ స్వామి, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన జూనియర్ ఇంటర్ పరీక్షలు

పామిడి: జూనియర్ ఇంటర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చివరిరోజు 364 మంది విద్యార్థులకు గాను 351 మంది పరీక్షలు రాశారు. పరీక్షలకు చీఫ్‌గా కృష్ణకుమార్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా రమేష్ వ్యవహరించారు. సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ప్రసాద్, పోలీసులు బందోబస్తు చేపట్టారు.

కోనలో 18న హుండీ కానుకల లెక్కింపు

తాడిపత్రి: మండలంలోని ఆలూరు గ్రామంలో ఉన్న ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఈఓ రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు డిపార్ట్‌మెంట్ అధికారి పర్యవేక్షణలో హుండీలో కానుకలను లెక్కిస్తామన్నారు.

క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వలను చేస్తున్న డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా

గుంతకల్లు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా సూచించారు. గురువారం స్థానిక రైల్వే క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులకు పలు పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా, ఆయన సతీమణి మమతగుప్తా ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు రాణించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ క్యాప్రల్ ఆరోరా, రైల్వే హైస్కూల్ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శికి సన్మానం



వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చెవుల మల్లయ్య యాదవ్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో బేతాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు వరించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ యాదవ్, ఈశ్వరయ్య యాదవ్, రంగయ్యయాదవ్, రామలింగయ్య యాదవ్, పురుషోత్తం యాదవ్, వాల్మీకి రంగయ్య, కిష్టన్న యాదవ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న దృశ్యం

పెద్దపప్పూరు: నేత కార్మికులకు నేతన్న పథకం ద్వారా రూ.36 వేలు అందిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చి, అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఏమాత్రం పట్టించుకోకపోవడంతో గురువారం మండల కేంద్రంలో నేత కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనగా ర్యాలీ చేసి నిరసన తెలిపారు. నేతన్న నేస్తం పథకంతో పాటు ముడిసరుకుల కొనుగోలుకు రాయితీ ఇవ్వాలని, అలా చేయని పక్షంలో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని సీపీఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం హెచ్చరించారు. జగనన్న పాలనలో నేతన్నలకు న్యాయం జరిగిందని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నేత కార్మికులను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు.

మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మున్సిపల్ స్థలాలు, అనుమతి పొందిన లే అవుట్లల్లోని రిజర్వ్, ఓపెన్ స్థలాలను ఆక్రమిస్తే, వాటిని తొలగించడమే కాకుండా ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. పట్టణంలో రిజర్వ్‌డ్ స్థలాల పరిరక్షణలో భాగంగా ఆక్రమణలను తొలగించి ఆ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తున్నామన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..



యాడికిలో దడిమాల ఆదిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దవడుగూరు: మండలంలోని ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొంబాయి రమేష్‌నాయుడు అన్నారు. వారం క్రితం వార్డ్ మెంబర్ దడియాల ఆది వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురంలో చికిత్స చేయించుకుని ఆయన గురువారం ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న నాయకులు బొంబాయి రమేష్‌నాయుడు, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్ తదితరులు ఆయనను ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఆవుకు నాగరాజు, గొడ్డుమరి రామమోహన్, వార్డు సభ్యులు తిరుపతి, మాలపాటి సతీష్‌నాయుడు, చిట్టింరెడ్డి బాలిరెడ్డి, రాముడు, కోటచౌదరి, దూదేవలి, చాంద్‌భాష, పెద్దిరాజు, శ్రీనివాస్, ఫరూక్, శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగలింగేశ్వరస్వామి తిరునాల



అలంకరణలో నాగలింగేశ్వరస్వామి

బుక్కరాయసముద్రం: మండలంలోని నీలాంపల్లిలో నాగలింగేశ్వర స్వామి తిరునాల గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నాగలింగేశ్వరునికి ఉదయం 6.30 నుంచి రాత్రి 7.30 వరకు గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, ఆలయ శుద్ధి, నవగ్రహ పూజ, కలశ స్థాపన , శ్రీవారి విగ్రహ సంప్రోక్షణ ఏకవార రుద్రాభిషేకం, పుష్పాలంకరణ అర్చనలు చేశారు. రాత్రి 12 గంటలకు స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. 14వ తేదీ లంకా దహన కార్యక్రమం నిర్వహించున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గజ వాహనంపై లక్ష్మీ చెన్నకేశవుడు



పెద్దవడుగూరు(యాడికి): మండలకేంద్రం యాడికి లో లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. రాత్రి పది గంటల నుంచి స్వామి వారు గజవాహనం పై కొలువు దీరి భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కాయ కర్పూరాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అశ్వత్థనారాయణ స్వామి కట్ట వార్షికోత్సవం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పోరాటకాలనీలో ఉన్న అశ్వత్థనారాయణస్వామి కట్ట పునరుద్దరణ ప్రథమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఏడాది క్రితం సేవా సమితి సభ్యులు శివయ్య, విశ్వనాథ్ ఆధ్వర్యంలో అశ్వర్థనారాయణ స్వామి కట్ట పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. భక్తుల విరాళాలతో అశ్వత్థనారాయణస్వామి, నాగదేవత, వినాయక విగ్రహాల ప్రతిష్ట చేశారు. ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు సామూహిక సత్యనారాయణ వ్రతం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని గాజుల క్రిష్ట వీధిలో ఉన్న రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిత సత్యనారాయణ వ్రతం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున హాజరు కావాలన్నారు.

పాల్గుణ పౌర్ణమి వేడుకలు



సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రం యాడికిలో ఉన్న కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం పాల్గుణ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పండితులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. 11 మంది దంపతుల చేతుల మీదుగా అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, కుంకుమార్చనలు, నూతన వస్త్రాలు సమర్పణ లాంటి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని మాముడూరు గ్రామానికి చెందిన రాధిక అనే మహిళ అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాధిక కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె బుధవారం అర్ధ రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో పడిఉన్న ఆమెను కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం వేకువ జామున ఆటో బోల్తా పడి ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. గుంటూరు జిల్లా కొరిటెపాడుకు చెందిన బ్రహ్మయ్య, దుర్గా ప్రసాద్, కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన హనుమంతు ఆటోలో గుత్తి వైపు వస్తున్నారు. జక్కలచెరువు గ్రామ శివారులో జాతీయ రహదారిపై మలుపులో వేగంగా వెళ్తూ ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ముగ్గురిని అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు టెక్ కళాశాల వార్షికోత్సవం

తాడిపత్రి: మండలంలోని వీరాపురం సమీపంలో ఉన్న తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం తెలిపారు. కళాశాల ప్రాంగణంలో సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టెక్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రెడ్డి, సెక్రటరీ సురేష్‌రెడ్డి హాజరవుతారన్నారు.

కొత్తపేటలో ఘనంగా ఉరుసు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట (కొత్తూరు)లోని చెరువు కట్టపై వెలసిన యాదుల్లా బాషా రహంతుల్లా అలైహి ఖాద్రీ ఉరుసు గురువారం ఘనంగా ప్రారంభించారు. వేకువజామున 5 గంటల సమయంలో పాతూరు నుంచి గంధంను చెరువు కట్ట వరకు ఊరేగించి దర్గాలో సమర్పించారు. జిల్లా నుంచే కాక ఇతర జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శుక్రవారం ఉరుసు, శనివారం జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశానికి పదో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి ఈ నెల 17 నుంచి మే 22 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. వివరాలకు మోడల్ స్కూల్లో సంప్రదించాలన్నారు.